ప్రజాశక్తి

శనివారం 19 నవంబర్ 2022 5 పార్వతీపురం మన్యం



తీరని కోర్కెలు కావు... తీరని హక్కులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీరని కోర్కెలు అడుగుతున్నారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అనడం ఉద్యోగుల్ని, ఉపాధ్యాయులను వంచించడమేనని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. అడగకుండానే అన్ని ఇస్తామని చెప్పిన వారు ఇప్పుడు అడిగితే తీరని కోర్కెలు అంటున్నారని అన్నారు. ఉద్యోగులు ప్రజల్లో భాగమేనని, ప్రజలకు సేవ చేస్తూ తమ జీవిత కాలాన్ని వెచ్చిస్తున్నామని అన్నారు. ఉద్యోగులపై ప్రజలను రెచ్చగొట్టేలా మంత్రి మాటలున్నాయని అన్నారు. నేను అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేస్తానని, మెరుగైన పిఆర్‌సి ఇస్తామని, డిఎలు సకాలంలో ఇస్తామని, ఇవన్నీ మేనిఫెస్టోలో పెట్టారని అన్నారు. మేనిఫెస్టో నాకు ఒక బైబిల్, ఖురాన్ భగవద్గీత అని అన్నారని ఇప్పుడేమో హక్కులను అడిగితే తీరని కోర్కెలని అణగదొక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించక పోగా, రెచ్చ గొట్టేలా మాట్లాడడం సబబుగా లేదని అన్నారు.

ఎవరి స్థలాల్లో వారే నిర్మించుకోవాలి

- బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై చర్యలు
- కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి
- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో గృహ నిర్మాణాలలో బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఒకరికి మంజూరు చేసిన స్థలంలో ఇతరులు అక్రమంగా నిర్మాణాలు చేపడితే అటువంటి విషయాలను, బెదిరింపులు, దౌర్జన్యాలను తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజాశక్తిలో శుక్రవారం ప్రచురితమైన 'ఒకరిస్థలం మరొకరికి' అన్న వార్తకు స్పందించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో గృహ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, నిబంధనలు అనుగుణంగా పట్టాలను జారీ చేసిందన్నారు. సంబంధిత లబ్ధిదారులు వారికి మంజూరు చేసిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టాలని ఆయన కోరారు. ఒకరి స్థలంలో ఇంకొకరు ఇళ్ల నిర్మాణం చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు.

కేంద్రమంత్రితో రాజన్నదొర భేటీ

సాలూరు : కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి అర్జున్ ముండాతో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర శుక్రవారం భేటీ అయ్యారు. గురువారం రాత్రి హుటాహుటిన ఢిల్లీ బయలుదేరిన రాజన్నదొర కేంద్రమంత్రిని కలిసి గిరిజన సమస్యల్ని పరిష్కరించాలని కోరారు. శ్రీశైలంలోని చెంచు తెగ గిరిజనులకు, పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లోని గిరిజనులకు ఉపాధి హామీకింద 180 పనిదినాలు కల్పించాలని కోరారు. కేరళలో రబ్బర్ సాగు మాదిరిగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో కాఫీ సాగుకు సంబంధించి పనులు మంజూరు చేయాలన్నారు. ఏజెన్సీలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కళాశాలలు, ఏకలవ్య, గురుకుల పాఠశాల లలో మౌలిక సదుపాయాల కల్పన గురించి మాట్లాడారు. పిటిజి తెగ గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. రెండో విడత ఏకలవ్య పాఠశాలలను మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివద్ధికి, గిరిజన సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని కేంద్ర మంత్రి అర్జున్ ముండా ప్రశంసించారని చెప్పారు. వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరిలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి రాష్ట్రంలో పర్యటించే అవకాశాలున్నాయని రాజన్నదొర చెప్పారు.

అరకొర జీతాలతో అవస్థలు

- పనిభారం పెరగడంతో ఆరోగ్య మిత్రల ఆందోళన
- పిహెచ్‌సిల్లో హెల్ప్ డెస్క్‌లు ఖాళీ



ప్రజాశక్తి - సాలూరు

చాలీచాలని జీతాలతో ఆరోగ్య మిత్రలు నానా అవస్థలు పడుతున్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, అరకొర జీతాలతో కుటుంబ పోషణ కత్తిమీద సాములా తయారైంది. దీంతో ఉన్న ఉద్యోగం వదులుకోలేక కొత్త ఉద్యోగాలకు పనికిరాక వారు సతమతమవుతున్నారు. ప్రస్తుతం వీరికి నెలకు రూ.15వేలు వేతనం అందుతోంది. పిఎఫ్, ఇఎస్‌ఐ కోతలు పోనూ రూ.13087 మాత్రమే అందుతోంది. రోజురోజుకు పెరిగిపోతున్న ధరలకు ఈ జీతాలతో కుటుంబ పోషణ తలకుమించిన భారంగా మారుతోంది. గతంలో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక ఆరోగ్య మిత్ర పని చేసే పరిస్థితి వుండేది. ఇప్పుడు వారిని ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు సర్దుబాటు చేశారు. పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఆరుగురు, స్థానిక ఫిలిడెల్ఫియా ఆసుపత్రిలో ఇద్దరు ఆరోగ్య మిత్రలు పనిచేస్తున్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వంద పడకల ఆసుపత్రిగా మారడం తో నిపుణులైన వైద్యులు ఇక్కడ నియామక మయ్యారు. ప్రతినెలలో శస్త్ర చికిత్సలు పెరుగుతున్నాయి. గర్భిణీల ప్రసవాలు, ఆపరేషన్లు పెరిగాయి. దీంతో ఆరోగ్యమిత్రలపై పనిభారం పెరిగింది. ఏరియా ఆసుపత్రి కావడంతో దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న రోగుల తాకిడి పెరిగింది. ఇలాంటి వారికి ఆరోగ్యశ్రీ సేవలు అందజేయడంలో ఆరోగ్య మిత్రల పాత్ర కీలకమైంది. పెద్ద ఆపరేషన్లు చేయించుకున్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పథకం కింద వారు విశ్రాంతి తీసుకునే రోజులకు భతి అందిస్తోంది. ఆపరేషన్లు చేయించుకున్న వారికి రోజుకు రూ.250 విశ్రాంతి తీసుకునే సమయం బట్టి భృతిని ప్రభుత్వం చెల్లిస్తోంది. అయితే ఈ ప్రక్రియలన్నీ ఆరోగ్య మిత్రలే ఆన్ లైన్‌లో ఎప్పటికప్పుడు పంపించాల్సి ఉంటుంది. అలాగే ఉన్నతాధికారులు కోరే సమాచారం ఇవ్వాలన్నా వీరికి కంప్యూటర్ సిస్టమ్ లు గానీ, ట్యాబ్ లు అందుబాటులో లేక నానా అవస్థ లు ఎదుర్కొంటున్నారు. సొంత స్మార్ట్ ఫోన్‌లోనే ఆసరా సమాచారం నిరంతరం అప్లోడ్ చేస్తుండడంతో జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ఆసుపత్రికి ఎక్కువగా వచ్చే రోగుల్లో మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన వారే వుంటున్నారు. వీరికి సంబంధించిన ఆధార్, రేషన్ కార్డుల్లో వివరాలు సక్రమంగా లేకపోవడంతో ఆన్‌లైన్ ప్రక్రియ సకాలంలో పూర్తి చేయడం తలనొప్పిలా తయారైంది. పని ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో కొంతమంది ఆరోగ్య మిత్రలు అయోమయంలో పడి ఉద్యోగాలను వదులుకోవడానికి సిద్ధమవుతున్నారు.

ఆరోగ్య మిత్రలకు తొలుత రూ.6 వేల వేతనం పంపిణీ చేసేవారు. 2019 డిసెంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం వీరి వేతనం రూ.9వేలకు పెంచింది. గత ఏడాదిలో ఈ వేతనాన్ని రూ.15వేలకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. పదేళ్లకు పైగా పనిచేసిన వారు కూడా అరకొర జీతాలతో నెట్టుకొస్తున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

16ఏళ్లుగా పనిచేస్తున్నాను. ఎదుగూబొదుగూ లేని ఉద్యోగం. ఆరోగ్య మిత్రలు ఏ కేడర్‌లోకి వస్తారో స్పష్టత లేదు. గతం కంటే పనిభారం పెరిగింది. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా జీతాలు లేవు. డిగ్రీ అర్హతతో ఉద్యోగాల్లోకి చేరాం. ఇప్పుడు వయసు మీరడంతో మరో ఉద్యోగానికి పనికిరాకుండా అయిపోయాం. ఉద్యోగ భద్రత కల్పించాలి.

వై.సింహాచలం ఆరోగ్య మిత్ర, సాలూరు

జనవరి 23,24,25 తేదీల్లో

శంబర పోలమాంబ జాతర

ప్రజాశక్తి మక్కువ



శంబరలో వేంచేసి ఉన్న పోలమాంబ అమ్మవారి జాతర తేదీలను ఖరారు చేశారు. శుక్రవారం సాయంత్రం చదురు గుడిలో ఆలయ ట్రస్టీ బోర్డు చైర్మన్ పూడి దాలినాయుడుతో పాటు, గ్రామ పెద్దలు ఆలయ కార్యనిర్వహణ అధికారి బి ఎల్ నగేష్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో 2023 జనవరిలో జరగనున్న అమ్మవారి జాతర తేదీలను, మారు జాతర, తదుపరి 10 వారాల తేదీలను అంతా ఏకాభిప్రాయంతో ఖరారు చేశారు. ఈ మేరకు ఈ ఏడాది డిసెంబర 19న శంబర జాతరలో ప్రధాన ఘట్టమైన పెద్ద పాలమాంబను తెచ్చేందుకు సనప చాటింపు వేస్తారు. తదుపరి డిసెంబర్ 21న పెదపోలమాంబను గ్రామంలోకి తీసుకొస్తారు. జనవరి 4న అంపకం చేస్తారు. అదే రోజు చిన పోలమాంబను తెచ్చేందుకు సనప చాటింపు, జనవరి 9న చినపోలమాంబను గ్రామంలోకి తెస్తారు. జనవరి 23న పోలమాంబ జాతర తోలేళ్ల ఉత్సవం, 25న పోలమాంబ జాతరలో ప్రధాన ఘట్టమైన సినిమానోత్సవం, జనవరి 26న పాలమాంబ అమ్మవారి అంపకోత్సవం, జనవరి 31న పోలమాంబ వారి జాతర, మార్చి 28న చండీ హెూమం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు, ఎంపిటిసి తీళ్ల పోలినాయుడు, మాజీ చైర్మన్ గంజి కాశినాయుడు, విరినాయుల్లు పొడిపిరెడ్డి శివున్నాయుడు, అక్కాన నరసింగరావు, గిరడ శ్రీనివాసరావు, కుప్పిలి గోపి, సర్పంచ్ సింహాచలమమ్మ, అల్లు తిరుపతిరావు, తీళ్ల శ్రీరాములు, గొంగాడ సింహాచలం, గంజి తిరుపతి నాయుడు, జన్నివారి కుటుంబీకులు తదితర్లు పాల్గొన్నారు.

24న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

కలెక్టరేట్ : జిల్లాస్థాయి యువజనోత్సవాలు ఈ నెల 24న స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు యువజన సర్వీసుల ముఖ్య కార్య నిర్వహణాధికారి బి.రామానందరావు తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనదలచిన యువతీ యువకులు విజయనగరం జిల్లా కంటోన్మెంట్, సెట్విజ్ వారి కార్యాలయానికి నేరుగా గాని లేదా setviz@yahoo.com కు వాట్సప్ నెంబర్ 8247 554334 కు ఈనెల 23 సాయంత్రం 5 గంటల్లోపు మీ దరఖాస్తులు పంపాల్సిందిగా కోరారు. దరఖాస్తులన్నీ ఎంపిడిఒ కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. పోటీలను సందర్శించేందుకు అందరూ ఆహ్వానితులే అని జిల్లా యువజన సర్వీసుల సిఇఒ ప్రకటనలో తెలిపారు.



ఆర్‌బికె వద్ద రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ధాన్యం కొనుగోలుపై అవగాహన అవసరం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ధాన్యం కొనుగోలుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మండలంలోని పెదబొండపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు, పౌర సరఫరాల సంస్థ అందించిన పరికరాలు, గోనె సంచులు తదితర వివరాలను కలెక్టర్ శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వరి క్షేత్రంలోకి స్వయంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలు సమయంలో ధాన్యం తేమ శాతం ముందుగా పరిశీలించాలని రైతులకు సూచించారు. గోనె సంచులు అందుబాటులో ఉండాలనిస్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను గురించి స్పష్టమైన అవగాహన ఉండాలని, మద్దతు ధర కంటే తక్కువకు విక్రయించాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. సాధారణ రకం క్వింటాలు (100 కిలోలు) రూ.2,040, 75 కిలోలు రూ. 1,530, గ్రేడ్ 'ఏ' రకం (100 కిలోలు) రూ.2,060, 75 కిలోలు రూ.1,545 రైతులు నేరుగా ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని విక్రయించాలని ఆయన పేర్కొన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు అవసరమైన గోనె సంచులు, హమాలీలు, రవాణా సదుపాయాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాయని ఆయన చెప్పారు. కలెక్టర్ వెంట వ్యవసాయశాఖ జెసి కె.రాబర్ట్ పాల్, వ్యవసాయ అధికారి రేఖ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

27న టిటిసి పరీక్ష

కలెక్టరేట్ : ఈ నెల 27న ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు జరగనున్న టిటిసి (టెక్నికల్ టీచర్స్ సర్టిఫికేట్ కోర్సు) లోయర్ గ్రేడ్ థియరీ పరీక్షలుకు హాజరగు విద్యార్థుల హాల్ టిక్కెట్లను www.bse.ap.gov.in వెబ్సైట్‌లో పొందుపర్చారని, కావున పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టిక్కెట్లను వెబ్సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని డిఇఒ ఎస్‌డివి రమణ తెలిపారు. విద్యార్థులు హాల్ టిక్కెట్‌తో పాటు ఏదైనా (పాస్ పోర్ట్, పాన్ కార్డ్, వోటర్ ఐడి, ఆధార్ కార్డ్) గుర్తింపు కార్డును పరీక్షకు తీసుకెళ్లాలని, ఈ పరీక్షలు విశాఖపట్నం, కృష్ణా, గుంటూరు, కడప, అనంతపురంలోని తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో జరుగునని తెలిపారు.

గిరిజన బాలికలను విచారించిన డిఎస్‌పి

సాలూరు : మండలం లోని కురుకుట్టి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం పార్వతీపురం డిఎస్పీ సుభాష్ విద్యార్థినులను విచారించారు. బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన హెచ్ఎం కృష్ణారావుపై పోక్సో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కావడంతో ఆయన విచారించారు. పాఠశాల బాలికలతో కలిసి డిఎస్పీ సుభాష్, రూరల్ ఎస్ఐ ప్రయోగమూర్తి మధ్యాహ్న భోజనం చేశారు. వారితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

పరిహారం అందజేత

జియ్యమ్మవలస : ఏనుగుల దాడిలో ఆవును కోల్పోయిన పాడి రైతుకు రూ.55వేల చెక్కును శుక్రవారం కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి అందజేశారు. కొమరాడ మండలం దలైపేటకు చెందిన జి.వెంకటరమణకు చెందిన ఆవు ఏనుగుల దాడిలో చనిపోయింది. ఇందుకు నష్టపరిహారంగా అటవీశాఖ అధికారులు పరిహారాన్ని అందించారు. కార్యక్రమంలో రేంజర్ రాజబాబు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు

ప్రజా గొంతుకై పనిచేస్తా..

పరిచయ సభలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా గొంతుకనై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతాంగ, నిరుద్యోగ వాణిని చట్ట సభల్లో వినిపిస్తానని, వారి హక్కుల సాధనకు కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ అన్నారు. రమాప్రభ పరిచయ సభ శుక్రవారం ఎన్‌జిఒ హోమ్‌లో యుటిఎఫ్ జిల్లా నాయకులు ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రమాప్రభ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు అండగా ఉంటామన్నారు. పాదయాత్ర, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరితే నిర్బంధాలు విధించడం సరికాదన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే ఉత్తరాంధ్ర వెనుకబాటులో ఉందన్నారు. అన్ని వర్గాల సమస్యలపైనా క్షేత్ర స్థాయిలో అవగాహన ఉందని, తనను గెలిపిస్తే వాటి పరిష్కారానికి పని చేస్తానని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధానకార్యదర్శి ఎ.అజశర్మ మాట్లాడుతూ చట్టసభల్లో ప్రజావాణి వినిపించే వారు లేరని, చట్టసభలలో ప్రజలు, నిరుద్యోగులు, కార్మికులు, ఉద్యోగ, ఉపాధ్యాయులు, రైతాంగ సమస్యలు పరిష్కారానికి పని చేసే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభను గెలిపించాలని కోరారు. పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రౌతు రామమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత పాలకులు ఉద్యోగుల హక్కులపై దాడి చేస్తున్నారని, ఉద్యమ నేపథ్యం ఉన్న రమాప్రభను గెలిపించాలని కోరారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ పాలనకు అడ్డుకట్ట వేయాలంటే పిడిఎఫ్ ఎమ్మెల్సీగా రమాప్రభను గెలిపించాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమప్రభకు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కర్రి సత్యనారాయణ, జన విజ్ఞాన వేదిక నాయకులు శ్రీనివాసరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాము, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కె.విజయగౌరి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పరిచయ సభలో మాట్లాడుతున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ

ఫలించిన విద్యార్థి, ఉద్యోగసంఘాల పోరాటం

సాలూరులోనే ఎటిడబ్ల్యుఒ కార్యాలయం

డిప్యూటీ సిఎం ఆదేశాలతో తాజా ఉత్తర్వులు

ప్రజాశక్తి - సాలూరు

నియోజకవర్గ పరిధిలోని గిరిజన విద్యార్థి, ఉద్యోగ సంఘాల పోరాటం ఫలించింది. జిల్లాల విభజనలో భాగంగా ఎత్తివేసిన సహాయ గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సాలూరులో ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. తరలించిన సహాయ గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సాలూరులోనే వుండాలని, గతంలో పట్టణంలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల, బాలుర పాఠశాల లను ఏర్పాటు చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన, ఉద్యోగుల సంఘం నాయకులు ఈ ఏడాది జులై2న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన బోసు బొమ్మ జంక్షన్‌లో రిలే దీక్షలు చేపట్టారు. 73,586 గిరిజనులు కలిగిన ప్రాంతంలో 14గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలున్న ప్రాంతం నుంచి సహాయ గిరిజన సంక్షేమాధికారి కార్యాలయాన్ని తరలించడం సరికాదని ఆందోళన చేపట్టారు. డిప్యూటీ సిఎం రాజన్నదొరకు వినతిపత్రం అందజేశారు. రాజన్నదొర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అయిన వెంటనే ఈ సమస్య దృష్టికి రావడంతో ఆయన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విజయనగరం జిల్లా నుంచి పార్వతీపురం మన్యం జిల్లా విడిపోయిన వెంటనే ఇక్కడ ఉన్న సహాయ గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయాన్ని విజయనగరం తరలించడం, పార్వతీపురంలో వున్న సహాయ గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయంలో సాలూరు పాచిపెంట, మక్కువ మండలాల్లో వున్న ఆశ్రమ పాఠశాలలను విలీనం చేయడం జరిగింది. ఈ నిర్ణయాన్ని గిరిజన విద్యార్థి, ఉద్యోగసంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. సాలూరులో ఈ కార్యాలయం లేకపోతే గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని మంత్రి రాజన్నదొర దృష్టికి తీసుకెళ్లారు. పార్వతీపురంలో ఉన్న సహాయ గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సాలూరు తరలించాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గడచిన నాలుగు నెలలుగా ఈ కార్యాలయం మూతపడి వుంది. తాజా ఉత్తర్వులతో ఈ కార్యాలయం తెరుచుకోనుంది. గతంలో వున్న మాదిరిగానే సహాయ సిబ్బందితో పాటు కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశించింది. దీంతో విద్యార్థి, ఉద్యోగసంఘాల పోరాటం ఫలించిట్లయింది. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర చొరవ తీసుకుని కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడంపై గిరిజన సంఘాలు హర్షం చేస్తున్నాయి.



రిలేనిరాహారదీక్షలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు (ఫైల్)

ఎపిఎన్‌జిఒ డివిజన్ కార్యవర్గం ఎన్నిక

పాలకొండ : ఎపి ఎన్‌జిఒ పాలకొండ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం స్థానిక కోటదుర్గ కళ్యాణ మండపంలో సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తనాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం, కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. డివిజన్ గౌరవ అధ్యక్షులుగా లిల్లీ పుష్పనాథం, అధ్యక్షులుగా కె.రంగాచార్యులు, అసోసియేట్ అధ్యక్షులుగా జె.రమేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా పి.ఈశ్వరరావు, ఉపాధ్యక్షులుగా పి.నర్సునాయుడు, సిహెచ్.రాజులమ్మ, జి.నాయుడు, సంయుక్త కార్యదర్శులుగా బివి హరగోపాల్, పి.వాసుదేవరావు, పి.కుమారస్వామి, ఎస్.హరిణి, కోశాధికారిగా ఎస్.దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ, రెవెన్యూ డివిజన్ అధ్యక్షులు సావిత్రి, పాలకొండ ఉప తహసీల్దారు, జిల్లా రెవెన్యూ సహాధ్యక్షులు బి.బుచ్చయ్య కొత్త కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

గిరిజన నృత్యాలకు అధికారుల నుంచి మన్నలు

గుమ్మలక్ష్మీపురం : గిరిజన పక్షాన ఉంటూ బ్రిటీష్ వారితో పోరాడి అమరుడైన బిర్సా ముండా జయంతి సందర్భంగా విశాఖపట్నంలో వారం రోజులు పాటు నిర్వహిస్తున్న గిరిజన ఉత్సవాల్లో పాల్గొన్న గుమ్మలక్ష్మీపురం మన్యం థింసా బృందానికి అధికారుల నుంచి ప్రశంసల జల్లు వస్తున్నాయి. మాస్టర్ సోంబర ఆధ్వర్యంలో కళాకారులు ఇస్తున్న నృత్య ప్రదర్శనలకు మన్నలు అందుకున్నారు.




తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు, పేదలు

పేదలకు భూములు అప్పగించాలని ధర్నా

వీరఘట్టం : మండలంలోని సంత నర్సిపురంలో దళిత, పేదలకు భూములు అప్పగించాలని శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండో విడతలో భాగంగా 151 మందికి 151 ఎకరాలు భూమిని పంపిణీ చేశారన్నారు. అయితే పట్టాలు ఇచ్చారు తప్ప భూమి ఎక్కడ ఉందో అధికారులు చూపించలేదన్నారు. భూమి చూపాలంటూ ఈ 14ఏళ్లలో వందలసార్లు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాలు, వంటా వార్పు వంటి కార్యక్రమం చేసినా రెవెన్యూ అధికారుల్లో స్పందన లేదన్నారు. నలుగురు తహశీల్దార్లు మారినా సమస్య పరిష్కారం కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పది రోజుల్లో సమస్య పరిష్కరించాలని, లేకుంటే తహశీల్దార్ కార్యాలయం ఎదుట కుటుంబాలతో వచ్చి ఎన్ని రోజులైనా ధర్నా, వంటావార్పు కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ఆర్ఐ ప్రసాదరావుకు వినతిని అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు, పలువురు దళితులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - బలిజిపేట



పంట దిగుబడిపై రైతులతో మాట్లాడుతున్న జెసి ఆనంద్

మండలంలోని తుమరాడ, మిర్తివలస గ్రామాల్లో గల రైతు భరోసా కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచుల నిల్వలు పరిశీలించి, ఇంకా అవసరమైన వాటిని తెప్పించుకోవాలని సూచించారు. ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పరీక్షించే కిట్లను కూడా పరిశీలించి. తుమరాడలో రైతులకు రైతు భరోసా కేంద్రాలు ఆవశ్యకతపై వివరించారు. ఏ పంట వేశారు, ఎంత దిగుబడి వస్తుంది, ఎప్పుడు నూర్పిడి చేస్తారు అన్న విషయాలను రైతులతో చర్చించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టెక్నికల్ అసిస్టెంట్, వాలంటరీ, రూట్ ఆఫీసర్ తప్పనిసరిగా ఉండాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రైతులంతా ఇవ్వాల్సిందిగా ఆయన తెలిపారు. ఆయన వెంట తహశీల్దారు వివిఎస్ శర్మ, ఎంపిడిఒ భానుమూర్తి, సిఎస్‌డిటి రమేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా నివారణకు చర్యలు


ప్రజాశక్తి - పాలకొండ రూరల్

పశువులు అక్రమ రవాణా నిరోధించేందుకు కఠిన చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అధికారులను అదేశించారు. శుక్రవారం డివిజన్ స్థాయి జంతు సంరక్షణ కమిటీ సమావేశం సబ్‌కలెక్టర్ అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణా అరికట్టేందుకు సరిహద్దుల్లో చెక్ పోస్టు ఏర్పాటు చేయాలన్నారు. పశువుల రవాణాకు వాటి కొరకు తయారు చేసిన ప్రత్యేక వాహనాలు మాత్రమే ఉపయోగించాలన్నారు. మండల స్థాయిలో అధికారులంతా జంతు సంరక్షణపై చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో ప్రతి మూడు నెలలకొకసారి సమావేశం ఏర్పాటు చేయాలని తెలిపారు. పవిత్ర దినాల్లో మాంసం విక్రయాలు జరుపకూడదన్నారు. జంతువులను హింసిస్తే చట్ట రీత్యా చర్యలు ఉంటాయన్నారు. గో సంరక్షణ కమిటీ అధ్యక్షులు ఎల్.రామకష్ణ మాట్లాడుతూ లంపి స్కిన్ వ్యాధి నివారణకు, పశువుల రవాణా నిషేధం కఠినంగా అమలు చేయాలన్నారు. అనుమతుల్లేకుండా పశువులను తరలించకుండా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని సబ్‌కలెక్టర్‌ను కోరారు. జంతువులను హింసకు గురి చేసే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పశు సంవర్ధక శాఖ ఎడి మాణిక్యరావు, సిఐ కె.మురళీధర్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, డివిజనల్ పంచాయతీ అధికారి జె.రాంప్రసాదరావు, అసిస్టెంట్ లేబర్ అధికారి కె.కిరణ్‌చంద్ర, అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

వెల్నెస్ ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యమందించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పిహెచ్‌సిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 281 వెల్నెస్ సెంటర్లో ఉన్నాయని, వీటి ద్వారా గ్రామంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ ఫిజీషియన్ కార్యక్రమం ముమ్మరంగా సాగుతున్నట్లు తెలిపారు. వీటి ద్వారా 67 రకాల మందులు 15 రకాల వైద్య తనిఖీలు నిర్వహిస్తున్నట్టు స్పష్టం చేశారు. 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ప్రజలకు అందుబాటులు ఉండేలా ఇద్దరే వైద్యాధికారులను నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని 24 ఎంఎల్‌ఒ, 5ఎఎన్ఎం పోస్టులు వీటిని త్వరలో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా జనరల్, ఫీవర్ కేసులు, గర్భిణీలు, బాలింతలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్‌సిడిసి ద్వారా గ్రామాల్లో మధుమేహం, రక్తపోటు తదితరమైన వ్యాధులకు గురైన వారిని గుర్తించినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేసుకున్న వారిని పరిశీలిస్తున్నట్టు స్పష్టం చేశారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.


నిరుద్యోగ యువతనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

నిరుద్యోగుల చెంతకు కంపెనీలు : ఎమ్మెల్యే

జియ్యమ్మవలస : నిరుద్యోగుల చెంతకు కంపెనీలు వచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయని కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. శుక్రవారం చిన్నమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎపి స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలోనూ స్కిల్ డెవలప్మెంట్ సంస్థ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ జాబ్‌మేళాలో 14 కంపెనీల సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. జాబ్ మేళాకు 420 మంది హాజరు కాగా 181 మంది యువతీ యువకులను ఆయా కంపెనీల ప్రతినిధులు ఎన్నుకున్నారని స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ యు.సాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో కాలేజీప్రిన్సిపల్ జె.రామారావు, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి రవీంద్ర పాల్గొన్నారు


విద్యార్థిని పాఠ్యాంశంపై ఆరా తీస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

వెనుకబడిన విద్యార్థులను గుర్తించండి : సబ్‌కలెక్టర్

పాలకొండ : చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సబ్ కలెక్టర్ నూరల్ కమర్ సూచించారు. స్థానిక వెంకంపేటవీధిలోని ఎంపియుపి పాఠశాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. పలు తరగతులకు వెళ్లి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించారు. కొందరు విద్యార్థులు చదవడంలో కూడా వెనుకబడి ఉండడాన్ని గమనించారు. ఈ సందర్భంగా ఆయన హెచ్‌ఎం జి.పరాంకుశం నాయుడుతో మాట్లాడుతూ విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వారికి విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు.ఈ సందర్భంగా హెచ్‌ఎం ఇక్కడి విద్యార్థులు, వారి పరిస్థితులను సబ్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న రెండో విడత నాడు-నేడు పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు.

విద్యార్థులకు ప్రమాణ పత్రాలు అందజేత

సీతానగరం : మండలంలోని నిడగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భారత జీవ జీవిత బీమా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పురస్కారం ప్రమాణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ టివి చలపతిరావు మాట్లాడుతూ గత ఏడాది ప్రతి తరగతిలోని విభిన్న రంగాల్లో ప్రతిభ కనబర్చిన ప్రతి తరగతిలో ఇద్దరు విద్యార్థులను ఎంపిక చేసుకుని స్టూడెంట్ ఇయర్ పేరుతో ఆ విద్యార్థులకు సమస్త తరపున పురస్కారాలను, ప్రమాణ పత్రాలను అందజేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ వి.రమణమూర్తి, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు బి.సంజీవి, జయంతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శివున్నాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన రైతులకు ఉపకరణాలు పంపిణీ

కురుపాం : ఏజెన్సీలో గిరిజన రైతుల ఆర్థికాభివృద్ధికి కెవికె శాస్త్రవేత్తలు కృషి చేయాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం చింతపల్లి సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎం.సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం కెవికె రస్తాకుంటుబాయి కేంద్రాన్ని సందర్శించి డెమో యూనిట్లు, పంటలు పరిశీలించారు. అనంతరం రైతులకు గిరిజన ఉప ప్రణాళిక క్రింద గిరిజన రైతులకు బ్రష్ కటర్లు, వీడర్లు అందజేశారు. కార్యక్రమంలో కెవికె సమన్వయకర్త టిఎస్ఎస్‌కె పాత్రో, శాస్త్రవేత్తలు సౌజన్య, శ్రీనివాసరావు, అమ్మతవేణి, ప్రవంతి, అనంతపహరి, ఉమాజ్యోతి, అను తదితరులు పాల్గొన్నారు.

పెదబుడ్డిడిలో గడపగడపకు..

జియ్యమ్మవలస : మండలంలోని పెదబుడ్డిడిలో శుక్రవారం కురుపాం ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి లబ్ధిదారులకు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఎం.శశికళ, ఎంపిపి బొంగు సురేష్, ఎంఎస్ఎంఇ డైరెక్టర్ ఎం.గోశింకరరావు, డిసిసిబి డైరెక్టర్ లోలుగు నారాయణరావు, పెదబుడ్డిడి సర్పంచ్ సీమల సుజాత, సీమల బాబు భువన మోహనరావు, ఎంపిటిసి సభ్యులు రేవళ్ల జ్యోతి, ఆర్.సూరిబాబు, వైస్ సర్పంచ్ ఆర్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో కమిషనర్ తనిఖీలు

పార్వతీపురంటౌన్ : పట్టణంలోని 13,14 వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు శుక్రవారం పరిశీలించారు. సచివాలయాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమయపాలన పాటించాలని, ప్రతి కార్యదర్శి ఎవరికి సంబంధించిన గ్రీవెన్స్ రిజిస్టరును తప్పనిసరిగా ఉంచాలని తెలిపారు. వాలంటర్లు తప్పని సరిగా బయోమెట్రిక్ విధానంలో అటెండెన్సు పాటించాలని సూచించారు.

ఉపాధి పనులతో పంచాయతీల అభివృద్ధి

సీతానగరం : ఉపాధి హామీ పనులు గుర్తించిన వాటిని చెప్పడం ద్వారా పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని తామరకండి, గాజుల వలస, దయానిధిపురంలో ఉపాధిహామీ గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు కావలసిన నిధులను ఉపాధి హామీ ద్వారా అందజేస్తామన్నారు. ఎపిఒ పి.నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామ సభల్లో గ్రామాల అభివృద్ధికి సంబంధించిన పనులను గుర్తించి తీర్మానాలు ఆమోదించడంతో పనులను చేయడానికి వీలుంటుంది అన్నారు. ప్రతి గ్రామపంచాయతీలో ముందుగా పనులు గుర్తించి వాటి నివేదికలు మంజూరుకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు అన్నపూర్ణ, ఎం.లలిత, బి.అప్పలనరసింహం, బి.రామారావు పంచాయతీ కార్యదర్శులు పద్మ, అశోక్, శోభనారావు, టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పత్తి చేనులో మృతదేహం గుర్తింపు

జియ్యమ్మవలస : మండలంలోని రామభద్రపురం- నిడగల్లుగూడ గ్రామాల మధ్య గల పత్తిచేలలో మృతదేహాన్ని గుర్తించినట్లు జియ్యమ్మవలస ఎస్ఐ పి.అనీష్ తెలిపారు. వారం రోజులు క్రితం చనిపోయి ఉంటుందని, శవం బాగా కుళ్లిపోయిందని అన్నారు. దీనిపై విచారణ చేపట్టగా రామభద్రపురం గ్రామానికి చెందిన కొండగొర్రి మల్లేష్ (39)గా గుర్తించినట్లు తెలిపారు. అతని భార్య కొండగొర్రి రూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం ఎక్కువగా సేవిస్తాడని అతని భార్య ఫిర్యాదులో పేర్కొందని, ఎవరిపైనా ఎటువంటి అనుమానాలు వ్యక్తం చేయలేదని ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు 85 మంది విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం : విశాఖపట్నం గీతం కాలేజీలో శనివారం నుంచి రెండు రోజులు పాటు జరగబోయే రాష్ట్ర స్థాయి క్రీడలకు గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల నుంచి 85మంది గిరిజన విద్యార్థిని విద్యార్థులు హాజరైనట్లు ఎటిడబ్ల్యుఒ సురేష్‌కుమార్ తెలిపారు. కేదారిపురం, భద్రగిరి, పి ఆమిటి, టిక్కబాయి, నీలకంఠాపురం, ధర్మలక్ష్మీపురం, కురుపాం, మొండెంఖల్ క్లస్టర్ నుంచి విద్యార్థులు క్రీడలకు వెళ్తున్నట్లు తెలిపారు. వీరి కోసం ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేశామన్నారు.

సీతంపేట : జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యక్రమంలో ఐటిడిఎ పరిధిలో 133 మంది విద్యార్థులు క్రీడా సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంపికయ్యారు. విశాఖలో జరగబోయే ఈ పోటీలకు వెళ్లే వీరికి ఎపిఒ రోసిరెడ్డి జెండా ఊపి పంపించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ దేశ్, ఎపిఒ పి.కోటిబాబు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురంలో రాష్ట్రస్థాయి పోటీలకు పయనమైన విద్యార్థులు

విలువలతో కూడిన విద్యనందించాలి : డిఇఒ

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఎస్‌డివి రమణ అన్నారు. మండలంలోని వెలగవాడ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల విద్యాస్థాయిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లీష్ భాషాంశాలు మెరుగుపరచడానికి ప్రభుత్వం నిర్ధారించిన లెర్న్ ఏ వర్డ్ ఎ డే కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో నిర్వహించి చక్కని విద్యను అందించాలని, ఆంగ్ల మాధ్యమాన్ని సులభతరంగా అందించడానికి తగు సూచనలు చేశారు. మధ్యాహ్నం భోజనం మెనూ ప్రకారం నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఓపెన్ స్కూల్స్ డిస్టిక్ కో ఆర్డినేటర్ చొక్కాపు శ్రీనివాసరావు, ఎపిఒ వై.శంకరరావు, పాఠశాల ఉపాధ్యాయులు తిరుపతి నాయుడు ఉన్నారు.

వీరఘట్టం : మండలంలోని వండవలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిఇఒ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని బోధన చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమయపాలన పాటించి సకాలంలో పాఠశాల చేరుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం


వీరఘట్టం : ఉపాధ్యాయిని సూచనలు చేస్తున్న డిఇఒ రమణ

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలన్నారు. జగన్ విద్యా కానుక వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. బడి బయట పిల్లలను గుర్తించి వారు పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. పాఠశాలను అభివృద్ధిపర్చేందుకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. రెండో విడత జరుగుతున్న నాడు నేడు అభివృద్ధి పనులను పరిశీలించాలన్నారు. ఉపాధ్యాయులు ఎలా పాఠశాల బోధిస్తున్నారో తెలుసుకొనేందుకు విద్యార్థుల్లో ఒకనిగా కూర్చొని పాఠాలు విన్నారు. అంతకు ముందు ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు కెపి నాగమణి, సిబ్బంది ఉన్నారు.

భామిని : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కెజిబివి, మోడల్ స్కూల్‌ను డిఇఒ ఎస్‌డివి రమణ ఆకస్మిక తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కెజిబివిలో కొనసాగుతున్న నాడు నేడు పనులను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న వసతులు, విద్యా ప్రమాణాలు, సిబ్బంది గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్‌లో మండల్ లెవెల్ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ ప్రశ్నా పత్రాలను ఆవిష్కరించి విద్యార్థినిలకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్‌ఎం వెంకట రమణ, కెజిబివి ఎస్ఒ బి.శారద, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్.శివకుమార్, ఎఎస్ఒ శంకర్‌రావు, సిఎంఒ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాల, ఎంఆర్‌సి పాఠశాలను డిఇఒ ఎస్‌డివి రమణ తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. 8 నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు బాగా చదివేలా సామర్థ్యం పెంచేలా కృషి చేయాలని విద్యార్థులకు సూచించారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. ఆయనతో పాటు ఎంఇఒ ఆనందరావు, ప్రధానోపాధ్యాయులు చంద్రరావు, హేమసుందర్‌రావు తదితరులు ఉన్నారు.

స్వచ్ఛతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎటిడబ్ల్యు కె.చంద్రబాబు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇటీవల జిల్లా స్థాయి పోటీల్లో 100 మీటర్ల పరుగులో ఉత్తమ ప్రతిభ కనపరిచిన బిడ్డిక సురేష్, 200 మీ. పరుగులో బిడ్డిక శేఖర్, 1500 మీటర్ల పరుగులో పువ్వల జయసింహ, హైజంప్ లో పువ్వల ప్రేమ కుమార్, పాటల పోటీల్లో గ్రూప్ సాంగ్ విభాగం లోనూ, సోలో విభాగంలోనూ గెలుపొందిన మూటక ఆకాష్, నిమ్మల ప్రభాస్, చరణ్ తేజలను ఎటిడబ్ల్యుఒ చంద్రబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.రామగోవిందలు, వసతి గృహ సంక్షేమాధికారి సూర్యనారాయణ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని కోసింగిభద్ర ఆశ్రమ పాఠశాల ఆవరణంలో విద్యార్థులు శ్రమదాన నిర్వహించారు. పాఠశాల ఆవరణంలో పేరుకు పోయిన చెత్తను తొలగించి పరిసరాలను పరిశుభ్రత చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిడ్డిక ప్రసాదరావు ఉన్నారు.

పుస్తక పఠనంపై దృష్టి సారించాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ప్రతి ఒక్కరూ పుస్తక పఠనంపై దృష్టి సారించాలని డిఎస్‌పి సుభాష్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గాయత్రీ డిగ్రీ కళాశాలలో జిల్లా గ్రంథాలయసంఘ అధ్యక్షులు టి.శివకేశవరావు అధ్యక్షతన దిశ చట్టం, విద్యార్థులను చైతన్య పర్చేందుకు విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ పుస్తకాధ్యయనంపై దృష్టి కేంద్రీకరించాలని, గాంధీ, మేడమ్ క్యూరీ వంటి వారి జీవితచరిత్రలు అధ్యయనం చేసి ప్రేరణ పొందాలని సూచించారు. కార్యక్రమంలో సత్య హిందీ కళాశాల కరస్పాండెంట్ మంచిపల్లి శ్రీరాములు, కళాశాల కరస్పాండెంట్ మణికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక శాఖ గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవంలో భాగంగా విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించామని గ్రంథాలయాధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. సమాజానికి విజ్ఞాన శాస్త్రం అవశ్యకతపై పరీక్ష నిర్వహించామని, ఈ పరీక్షలకు స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మహర్షి పాఠశాల నుంచి 49మంది విద్యార్థులు పోటీ పరీక్షల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు రజని ,మహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొండ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 9,10 తరగతుల విద్యార్థులకు సామాజిక మాధ్యమాలు యువతపై వాటి ప్రభావం అన్న అంశంపై స్థానిక పెదకాపు వీధి హైస్కూల్‌లో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుమారు 65మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. స్థానిక పాఠశాల విద్యార్థులతో పాటు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ఆర్ సిఎం ప్రాథమికోన్నత పాఠశాల, తంపటాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, ప్రధానోపాధ్యాయులు జామి రవి, గొలివి తిరుపతిరావు, కొంగరాపు గడ్డయ్య, పాలవలస కష్ణకుమారి, మండల వెంకటరమణ, కోట నారాయణ, గొర్లె మురళి, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

సీతంపేట : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా 9,10 తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలకు స్థానిక హై స్కూల్‌లో సుమారు 25 మంది పిల్లలు పాల్గొన్నారు. స్థానిక హైస్కూల్, కెజిబివి, గిరిజన సంక్షేమ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలు హేమ సుందరరావు, జోత్స్న , మజ్జి శివకుమార్, గౌరీష్ పర్యవేక్షణలో జరిగాయి. స్థానిక గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

భామిని : స్థానిక గ్రంథాలయంలో లైబ్రయన్ సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ హైస్కూల్, కెజిబివి స్కూల్, బాలయోగి గురుకుల పాఠశాల, మోడల్ స్కూళ్ల నుంచి 50మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల సైన్స్, గణితం ఉపాధ్యాయులు సిహెచ్.గోవిందమ్మ, ఎం.వెంకటలక్ష్మి, కెజిబివి అధ్యాపకులు జి.కళావతి, మోడల్


సీతంపేట : వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

స్కూల్ లైబ్రేరియన్ సునంద పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా స్థానిక శాఖగ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వహణాధికారిని దొనక సుకన్య మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం, క్రీడా నైపుణ్యత ప్రతిభ పాఠవాలు వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయా లకు వచ్చి పుస్తకాలు చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మురళీధర్, రేవతి ఉన్నారు.

బలిజిపేట : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పెదపెంకి హైస్కూల్‌లో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో గ్రంథాలయాలు, వాటి ఉపయోగాలు అన్న అంశంపై విద్యార్థులకు అవగాహ కల్పించారు. హెచ్‌ఎం రామారావు, ఉపాధ్యాయులు జోగినాయుడు, ఎం.అప్పలనాయుడు, మల్లేశ్వరరావు విద్యార్థులకు గ్రంథాలయాల ఉపయోగాలు వివరించారు. కార్యక్రమంలో సోనూసూద్ అభిమాని గొర్లె శ్రావణ్, కర్రి సతీష్, పెనుబోతు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియాపై అవగాహన

పాలకొండ రూరల్ :పట్టణంలోని 7వ వార్డు పరిధిలో సాయిదుర్గనగర్ కాలనీ వాసులకు మలేరియా, డెంగీ వ్యాధులపై వైద్య సిబ్బంది శుక్రవారం పలు సూచనలు, సలహాలు అందించారు. మలాథియన్ స్ప్రేయింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్ జనార్ధనరావు మాట్లాడుతూ దోమలను నివారించేందుకు ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని, చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, ఫ్రిడ్జ్ వెనుక భాగంలో నీటిని ప్రతిరోజు తొలగించాలన్నారు. ఆయనతో పాటు వైద్య సిబ్బంది మోహనరావు, ఆశా వర్కర్ శాంతి, ఎంటిఎస్ భువనేశ్వర్రావు, సిబ్బంది ఉన్నారు.

ఐటిడిఎలో స్వచ్ఛత

సీతంపేట : జాతీయ గౌరవ దివాస్‌లో భాగంగా శుక్రవారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ ఆవరణలో పిచ్చి మొక్కలను ఐటిడిఎ అధికారులు, సిబ్బంది తొలగించారు. ఈ స్వచ్ఛత కార్యక్రమాన్ని ఈనెల 19న ఐటిడిఎ కార్యాలయంలోనూ, 20న సీతంపేటలో నిర్వహిస్తామని ఎపిఒ రోసిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎఒ విజయరాణి, ఎంపిడిఒ కె.గీతాంజలి, పిఎఒ హరికృష్ణ, సూపరింటెండెంట్ దేశ్, ఐటిడిఎ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ దురుసు ప్రవర్తనపై నిలదీత

ప్రజాశక్తి - భామిని

స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ విద్యార్థులు పట్ల కొద్దిరోజులుగా దురుసుగా ప్రవర్తిస్తున్నారని, దీంతో తమ పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపల్‌ను నిలదీశారు. ఈ విషయం తెలుసుకున్న బత్తిలి ఎస్ఐ కె.సీతారాములు కాలేజీకి వచ్చి విద్యార్థులు, ప్రిన్సిపల్‌తో కౌన్సిలింగ్ నిర్వహించి ఇటువంటి సమస్యలు కాలేజీలో పునరావృతం కాకుండా చూడాలని, చదువులకు ఇబ్బంది లేకుండా విద్యార్థులు పట్ల ప్రిన్సిపల్, సిబ్బంది సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. దీంతో గొడవ సద్దుమణిగింది. కార్యక్రమంలో మహిళా పోలీస్ చందన, ఇతర అధ్యాపకులు వున్నారు.

ఘనంగా ట్రైబల్ ఫ్రైడే

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ గౌరవ దివాస్ 2018 నుంచి జరుగుతుందని ఎంపిడిఒ కె.గీతాంజలి తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉపాధి వేతనదారులతో ట్రైబల్ ఫ్రైడే దినోత్సవం ఘనంగా నిర్వహించారు. దీని ప్రాముఖ్యత గురించి తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ సాగర్, ఇసి సింహాచలం, తదితరులు పాల్గొన్నారుం

శాస్త్రీయ దృక్పథానికి 'చెకుముకి' దోహదం : డిఇఒ

ప్రజాశక్తి - భామిని

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు, సైన్స్‌పట్ల, మూఢత్వం పట్ల అవగాహ కల్పించేందుకు చెకుముకి పోటీలు ఎంతగానో దోహదపడ తాయని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్‌విడి రమణ తెలిపారు. శుక్రవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో మండల స్థాయి చెకుముకి సైన్స్ పోటీలు ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిశీలనకు డిఇఒ చెకుముకి సైన్స్ పోటీ ప్రశ్నా పత్రాలను విద్యార్థులకు అందజేశారు. అనంతరం డిఇఒ మాట్లాడుతూ ఈ పరీక్షలు భవిష్యత్తులో పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల తరపున పెద్దదిమిలి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలోనూ, ప్రైవేట్ పాఠశాలల విభాగంలో గురండి విద్యా వికాస్ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. కార్యక్రమంలో చెకుముకి సైన్స్ ఐక్య వేదిక మండల కన్వీనర్ కె. మహేష్, సైన్స్ ఉపాధ్యాయులు జె.జోగారావు, రజిని, యతి రాజారావు పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక బాలురు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన చెకుముకి సైన్స్ సంబరాలు -2022 మండల స్థాయి క్విజ్ పోటీల్లో స్థానిక తమ్మినాయుడు కాన్సెప్ట్ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో విద్యార్థులను తమ్మినాయుడు విద్యాసంస్థల ప్రెసిడెంట్ ఎస్.నారాయణమ్మ, పాఠశాల ప్రిన్సిపల్ బిజుకుమార్, అధ్యాపక బందం, అభినందించారు.


పార్వతీపురం : బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ మండల స్థాయిలో నిర్వహించగా 51 మంది హాజరైనట్లు జెవివి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండపల్లి గౌరినాయుడు, ఎస్.మహేశ్వరరావు తెలిపారు. మండలంలోని 17 పాఠశాలల నుంచి 8, 9, 10 తరగతి విద్యార్థులకు సంబంధించి పరీక్ష నిర్వహించినట్లు వారు తెలిపారు .

జియ్యమ్మవలస : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు బిజెపి పురం ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించారు. గ్రామస్థాయిలో ఇటీవలనిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జియ్యమ్మవలస, బిజెపురం, చినమేరంగి, చినకుదమ, రావడ రామభద్రపురం ప్రాథమిక ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో చినమేరంగి పాఠశాలకు ప్రథమ బహుమతి, బిజెపురం పాఠశాల విద్యార్థులకు ద్వితీయ, చినకుదమ పాఠశాలకు తృతీయ బహుమతి లభించాయి. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. బిజెపురం ప్రధానోపాధ్యాయులు బడే జనార్ధననాయుడు ఆధ్వర్యంలో ఈ పోటీలు జరిగాయి.

చెకుముకి మండల స్థాయి విజేతలు వీరే

పార్వతీపురంరూరల్ : జెవివి చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా డాక్టర్ డివిఎంఎం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండలస్థాయి పరీక్షల్లో మండలం నుండి 6 పాఠశాలల నుంచి 8 టీం పాల్గొనగా అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎన్ ములగ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికయ్యారు. బందలుప్పి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు ద్వితీయ స్థానంలో నిలిచారు. పార్వతీపుర మున్సిపాలిటి నుండి 7 పాఠశాలల నుంచి 10 టీంలు పాల్గొనగా అందులో కెపిఎం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికయ్యారు. టిఆర్‌ఎంఎం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. కార్యక్రమం ప్రశ్నా పత్రాల్ని డివిఎంఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి గోవింద, జెవివి ప్రతినిధులు కె.భాస్కరరావు, ఎన్.శ్రీనివాసరావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఆవిష్కరించగా, విజేతలకు బహుమతి ప్రదానం వేదాంత జూనియర్ కాలేజి సౌజన్యంతో ఆ కాలేజి కరస్పాండెంట్ పి.అప్పారావు బహుమతులు అందించారు.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

గ్రీన్ అంబాసిడర్ల సమస్యలపై ధర్నా

పార్వతీపురంరూరల్ : మండలంలోని పలు పంచాయతీ కార్యాలయాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు విడుదల చేసి, వెంటనే వారి సమస్యలు పరిష్కరించాలని సిఐటియూ జిల్లా అధ్యక్షులు జి.వెంకటరమణ, గ్రీన్‌అంబాసిడర్ల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం కార్యాలయం సూపరింటెండెంట్ ఎల్‌వి అప్పారావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 నెలలుగా జీతాల్లేకపోయినా అర్ధాకలితో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్న హరితరాయబారులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని అన్నారు. అంతేకాకుండా వారి జీతాలు బాధ్యతను సర్పంచ్‌లే చూసుకోవాలని కొత్తగా నిబంధనలు అమలు చేస్తుందని అన్నారు. దీనివల్ల అంతంత మాత్రంగానే ఉన్న పంచాయతీలు వీరి జీతాలు సక్రమంగా ఇవ్వలేవని, కనుక ప్రభుత్వమే వీరికి జీవో 132 ప్రకారం నెలకు రూ.10వేలు జీతంగా ఇవ్వాలని, వారి విధుల నిర్వహణకు అవసరమైన పనిముట్లు, సామాగ్రి అందించాలని, హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని, రాజకీయ వేధింపులు అపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బంకురు సూరిబాబు, గ్రీన్‌అంబాసిడర్‌ల మండల నాయకులు అప్పలస్వామి, బాగారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మిస్టర్ ఆంధ్రా విజేత కిశోర్‌కు సన్మానం

పార్వతీపురంటౌన్ : విశాఖలో ఇటీవల నిర్వహించిన మిస్టర్ ఆంధ్ర పోటీల్లో స్థానిక మెదరవీధి చెందిన సూరాబత్తుల కిషోర్ 65 నుండి70 కేజీల విభాగంలో మొదటి విజేతగా నిలిచాడు. గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్న వివిధ శరీరక సౌష్టవ పోటీల్లో పలుమార్లు విజేతగా నిలిచి పార్వతీపురం ప్రాంతంలో మంచి పేరు సంపాదించుకున్న ఘనత కిషోర్‌కు ఉంది. కిషోర్ మిస్టర్ ఆంధ్ర గా గెలిచిన సందర్భంగా పట్టణంలో గల ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు కిషోర్ ను అభినందించారు. ఈ మేరకు శుక్రవారం బిజెపి ఎస్‌సి మోర్చా రాష్ట్రఉపాధ్యక్షులు సురగాల ఉమామహేశ్వరరావు కిషోర్ ను అభినందించి దుశాలువాతో సన్మానించారు.

పొడ్డిశలో వైద్య శిబిరం

కురుపాం : మండలంలోని ఊసకొండ పంచాయతీలో గల పొడ్డిశలో 104 వైద్యసిబ్బంది శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలోని 32 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మేరకు మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించి దోమతెరలు ప్రతి ఒక్కరూ కట్టుకొని వేడినీరు తాగాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు అభినవ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బి అధికారులపై ఆగ్రహం

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని సాలూరు, బొబ్బిలి, చినబోగిలి నుండి వచ్చే రహదారులు అధ్వానంగా ఉండడంతో ప్రజలు ప్రజా ప్రతినిధులను తిట్టిపోస్తున్నారని ఆర్అండ్‌బి అధికారులు సంబంధిత కాంట్రాక్టర్లు సకాలంలో రోడ్డు పనులు చేయకపోవడం వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సమావేశం చివరి దశకు చేరుకున్న సమయంలో ఆర్అండ్‌బి జెఇ కమలాకర్ రావడంపై మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపిపి మర్రి పారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడిఒ దేవకుమార్ పంచాయతీల విధులను ప్రస్తావిస్తుండగా పలువురు సర్పంచులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పంచాయతీకి వచ్చే నిధులు కంటే ఖర్చులు ఎక్కువ చేయాలని చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశాం. విద్యుత్, పారిశుధ్య కార్మికుల వేతనాలు పంచాయతీలకు అప్పగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఎప్పుడొస్తాయని ప్రశ్నించారు. ఇప్పటికే పంచాయతీలకు వచ్చిన ఆదాయం అంతంతమాత్రంగా ఉందని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలాఉండగా త్వరలో శంబర అమ్మవారి జాతర సమీపిస్తున్నప్పటికీ గత ఏడాది చేసిన కొన్ని పనులకు బిల్లులు ఇప్పటికీ అందలేదని స్థానిక ఎంపిటిసి పోలినాయుడు సభలో ప్రస్తావించారు. సర్పంచ్ మాట్లాడుతూ అధికారులు సమావేశాలు, సమీక్షలు చేస్తూ మాటలు తప్ప శంబర పంచాయతీకి ఒరిగింది ఏమీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతర సందర్భంగా ఆర్థికంగా తాము ఇబ్బందులు పడాల్సి వస్తుందని, అటు దేవాదాయ శాఖ గానీ, ఉన్నతాధికారులు గాని తోడ్పాటును ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై జెడ్‌పిటిసి సభ్యులు మాట్లాడుతూ ఈసారి ఉన్నతాధికారులు సమీక్షలు చేస్తే ఆర్థిక తోడ్పాటుతోనే జరపాలని సభ తీర్మానం చేయాలన్నారు. ఇప్పటికే శంబరలో చెత్త పేరుకుపోయిందని, వాటిని తొలగించేందుకు నిధులు చాలడంలేదని అన్నారు. దీనిపై సమావేశంలో తహశీల్దార్ సూర్యనారాయణ, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ భర్తను అరెస్ట్ చేయాలి : జనసేన

ప్రజాశక్తి -పార్వతీపురం టౌన్

తమపై దాడి చేసిన మున్సిపల్ చైర్పర్సన్ బోను గౌరీశ్వరి భర్త బోను ఆదినారాయణను వెంటనే అరెస్టు చేయాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక జనసేన కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా నాయకులు అనిల్ కుమార్, రెడ్డి కరుణ, గొర్లి చంటి, దాలి నాయుడు, రాజాన రాంబాబు, బంటు శిరీస్, మానేపల్లి ప్రవీణ్, సిరిపురం గౌరీశంకర్, తదితరులు విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బూరాడ వీధికి వెళ్లామన్నారు. అక్కడి స్థానికులు తమ వీధిలోని సామూహిక మరుగుదొడ్లు మాయమయ్యాయని, ఆ స్థలం కబ్జాకు గురైందని ఫిర్యాదు చేశారన్నారు. ఈ విషయమై ఆ స్థలాన్ని పరిశీలిస్తున్న సమయంలో మున్సిపల్ చైర్ పర్సన్ భర్త ఆదినారాయణ అక్కడికి వచ్చి తమను దుర్భాషలాడుతూ నా వార్డు మీరెవరు ఇక్కడకి రావడానికి, ఫోటోలు తీసుకోవడానికి మీకేంటి హక్కు అంటూ దాడికి పాల్పడ్డాడని అన్నారు. ఈ విషయమై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తక్షణమే ఆదినారాయణను అరెస్టు చేయాలన్నారు. ఇందుకు బాధ్యత వహించి చైర్ పర్సన్ బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు దీనిపై దర్యాప్తు చేసి ఆదినారాయణను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పార్వతీపురంలో జరుగుతున్న దౌర్జన్యాలు, కబ్జాలపై జిల్లా కలెక్టర్, పోలీసులు దృష్టి సారించాలని కోరారు. ఇకపై మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ఇకపై దృష్టి పెడతామని హెచ్చరించారు.

భూరక్షణపై అవగాహన సదస్సు

సీతానగరం : మండలంలోని కాశీపేట గ్రామ సచివాలయంలో శుక్రవారం భూ రక్షణ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎంవి రమణ మాట్లాడుతూ వైయస్సార్ భూ రక్షణ పథకం ద్వారా శాశ్వత హక్కు పొందడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో భూ సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సర్వేలో భూ యజమానులు గుర్తించి పూర్తిగా ఆ భూమిపైన, ఇళ్లపైన ఆ యజమానికి హక్కు ఉండేలా డాక్యుమెంట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున ప్రజలు వీటిని అర్థం చేసుకొని సహకరించి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తేలు జగన్నాథం, మాజీ జెడ్పిటిసి తెంటు వెంకట అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.